క్లుప్తంగా

మండల సమావేశం వాయిదా

మరికల్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సందర్భంగా మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వ సభ్య సమావేశం వాయిదా పడింది. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జరగాల్సిన సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి తమ నివేదికలను ఎంపీడీఓకు అందజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున మండల సమావేశంను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ యశోదమ్మ ప్రకటించారు.

నేడు సమ్మేళనం

నర్వ: నేడు మండల కేంద్రంలో ఖండ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మరికల్ ఖండ కార్యవహ కావలి రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమ్మేళనంలో మరికల్ ఖండలోని అన్ని గ్రామాల సంఘ కార్యకర్తలు పాల్గొంటారన్నారు. నర్వ పురవీధుల గుండా పథ సంచలన్, ప్రదర్శనలు నిర్వహిస్తారన్నారు. ముఖ్య అతిథులుగా లింగన్న రిటైర్డ్ టీచర్, గ్రామ సర్పంచ్ సంధ్యలతో పాటు ప్రధాన వక్తగా భారతీయ కిసాన్ సంఘ్ క్షేత్ర ప్రముఖ్ దోనూర్ రాము హాజరవుతారన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన అవసరం



దామరగిద్ద: ఎయిడ్స్, టీబీ వంటి దీర్ఘకాలిక వ్యాధుల పట్ల అవగాహన కల్గి ఉండాలని చైల్డ్ లైఫ్ ఇండియా డీఆర్పీ శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ వీరప్పలు అన్నారు. శనివారం మండలంలోని నర్సాపూర్ గ్రామంలో చైల్డ్ లైఫ్ ఇండియా మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించారు. 18–60 ఏళ్ల లోపు వయసు కలిగిన ప్రతి ఒక్కరు విధిగా రక్త పరీక్షలు చేసుకోవాలన్నారు. గ్రామంలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చినా 100 మందికి పైగా యువతీ యువలకు మహిళలు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ సూపర్ వైజర్ కృష్ణ, ఏఎన్ఎం బాలచంద్రమ్మ, సర్పంచ్, ఎంపీటీసీ కొండప్ప, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిడ్జింత పాఠశాలలో కళాజాతా



మద్దూరు: కొత్తపల్లి మండలంలోని నిడ్జింత ఉన్నత పాఠశాలలో పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో శనివారం ప్రదర్శన నిర్వహించారు. సైబర్ నేరాలు, నాయకత్వ లక్షణాలు, గోల్ సెట్టింగ్, చదువుపై శ్రద్ధ, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రఘు, కళాబృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, రుక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి తరలిన మండల వాసులు

దామరగిద్ద: నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి కుటుంబ సభ్యుల సమేతంగా ఏర్పాటు చేసిన సీతారాముల కల్యాణ మహోత్సవానికి మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, టీఆర్ఎస్ శ్రేణులు, సీతారాముల భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. గత ఐదురోజుల పాటు నిర్వహించిన సుందర కాండ పారాయణం అనంతరం శనివారం చేపట్టిన సీతరాముల పట్టాభిషేకం ప్రత్యేక పూజల్లో వారు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.

బైరంకొండలో అలరించిన బాలసభ



నారాయణపేట రూరల్ : మండలంలోని బైరంకొండ ఎంపీ యూపీఎస్‌లో శనివారం నిర్వహించిన బాలసభ ఎంతో అలరించింది. చిన్నారులు పలు అంశాలపై ఉపన్యాసం, కవితలు చెప్పారు. అదేవిధంగా వివిధ దేశభక్తి, దైవభక్తి పాటలకు సంబంధించి చేసిన నృత్యాలు ఎంతో అలరించాయి. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణయ్య, గ్రామ పెద్దలు, టీచర్లు మహేష్, బాలప్ప, స్నేహలత, విద్యావతి, అశోక్, గీత, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



ఊట్కూరు: మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో శనివారం ఉదయం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ అబ్జల్ తెలిపారు. గ్రామానికి చెందిన సురేశ్ గ్రామ శివారు నుంచి తరలిస్తుండగా పెట్రోలింగ్‌కు వెళ్లిన సిబ్బంది పట్టుకున్నారని పేర్కొన్నారు. అనుమతులు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదకర మలుపులు

- తరచూ ప్రమాదాలు
- ప్రాణాలుబోతున్నా పట్టించుకోని అధికారులు



ఉజ్జెల్లికి వెళ్లే దారిలో ఇలా..



వద్వాట్ - అడవిసత్యారం దారి

మాగనూర్: జిల్లాలోని ఆయా మండలాల నుంచి గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రమాదకర మలుపులతో ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఆయా రహదారుల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రాణాలు పోయిన ఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు.

ఆయా దారుల్లో పరిస్థితి ఇలా..

వద్వాట్ –మందిపల్లి ప్రధాన దారిలో పూర్తిగా మలుపులు ఉండటం, రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలువురు గాయాలపాలయ్యారు. కొంతమంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ దారిలో ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ముఖ్యంగా వద్వాట్ శివాలయం సమీపంలో ఇటీవల ఎక్కువగా ప్రమాదాలు జరిగాయి.

- అడవిసత్యారం – కొల్పూర్ వద్ద దారిలో ప్రమాదకర మలుపులు అధికంగా ఉన్నాయి. ఈ దారిలోనూ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఉజ్జెల్లికి వెళ్ల మార్గంలోనూ మూల మలుపులు అధికంగా ఉండడం, ఆయా మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

- దీంతో ఇప్పటికైనా అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ఆయా మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా పెరగిన కంపచెట్లను తొలగింపజేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

మరికల్ మండలంలో..

మరికల్: మండలంలోని కన్మనూర్ గాజులయ్య తాండ మధ్య ఉన్న ఓ మలుపు ప్రమాదభరింతగా ఉంది. దాదాపు వంద అడుగుల లోతులో ఉన్న కాలువపై ఉన్న వంతెనకు ఒక వైపు రక్షణ గోడ కూలిపోయింది. రాత్రి సమయంలో బైక్‌లు, వాహనాలు అదుపు తప్పితే వంద అడుగుల లోతుల్లో పడిపోవాల్సిందేనని ప్రజలు వాపోతున్నారు. సంబందింత అధికారులు స్పందించి మలుపు దగ్గర సూచికబోర్డుతో పాటు, కూలిన రక్షణ గోడను తిరిగి నిర్మించాలని కోరుతున్నారు.



వంపులు తిలిగిన రోడ్డు

త్వరలోనే పరిష్కరిస్తాం



ఆయా దారుల్లో మలుపుల వద్ద జరుగుతున్న ప్రమాదాల మాట వాస్తవమే. అయితే ఈ విషయంపై ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. నూతనంగా నిర్మించిన రోడ్లకు అన్ని సౌకర్యాలు కల్పించాం. కొన్ని పాత రోడ్లు కావడంతో మొదట్లో ఏర్పాటు చేసినవి ప్రస్తుతం లేవు. అతి త్వరలోనే అవసరమైన పనులు ప్రారంభించి సమస్యలు పరిష్కరిస్తాం.

– విలోక్, పంచాయతీరాజ్ ఏఈ, మాగనూర్

సూచికబోర్డులు ఏర్పాటు చేయాలి



మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే దారుల్లో మలుపులు అధికంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి కనీస చర్యలు తీసుకోవాలి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. అవసరమైన చోట జీబ్రా క్రాసింగ్ గుర్తులు వేయాలి. రాత్రివేళల్లో కనిపించే విధంగా రేడియం స్టిక్కరింగ్ చేయాలి. అదే విధంగా దారుల్లో ఉన్న గుంతలను పూడ్చి వేయించాలి.

– బసంత్‌రెడ్డి, వద్వాట్

అధికారులు చర్యలు తీసుకోవాలి

దారుల్లో మలుపుల వద్ద కంపచెట్లు ఏపుగా పెరగడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అదేవిధంగా రాత్రి సమయంలో కటింగ్ కాక, ఎదురెదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి కిందపడి చాలామంది గాయపడుతున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

– అరవింద్, వద్వాట్

'అభివృద్ధిని మరిచిన ప్రభుత్వం'



రెనివట్లలో మాట్లాడుతున్న నాయకులు

నారాయణపేట రూరల్ : అవినీతిలో కూరుకుని పోయిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా పనిచేద్దామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సత్యాయాదవ్ అన్నారు. పార్టీ పటిష్ఠతకు నిర్వహిస్తున్న శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్ ను మండలంలోని అప్పిరెడ్డిపల్లిలో శనివారం నిర్వహించారు. కెంచె శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధన్వాడ: తెలంగాణ ఏర్పాటు జరిగిన తరువాత మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ప్రజలను అభివృద్ధికి దూరం చేశారని బీజేపీ జిల్లా నాయకులు నర్సన్‌గౌడ్ అన్నారు. చర్లపల్లి గ్రామంలో శనివారం ప్రజా గోస బీజేపీ భరోస కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధిని మరిచిందన్నారు. దళితులకు మూడెకరాల భూమి యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాల గురించి వివరించారు. ఇందులో మండల ఇన్‌చార్జ్ ఉదయ భాను, పాండునాయక్, నర్సిములు పాల్గొన్నారు.

మద్దూరు: రాష్ట్రంలో కాషాయ జెండాను ఎగుర వేద్దామని బీజేపీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పున్నంచంద్‌లాహోటి అన్నారు. శనివారం మండలంలోని రెనివట్లలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే విద్యాభివృద్ధి

నారాయణపేట రూరల్ : విద్యావ్యవస్థ బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌బాబు అన్నారు. తిర్మలాపూర్ యూపీఎస్‌లో చిన్నారులకు దుస్తులు అందించారు. హెచ్ఎం మొల్గాన్‌జనార్దన్, ఎస్ఎంసీ చైర్మెన్ దస్తప్ప, నర్సింహులు, బాలప్ప, బుడ్డప్ప, నర్సప్ప, టీచర్లు చంద్రశేఖర్, కరుణాకర్, వినయ్, అర్చన, పద్మ, ప్రియాంక పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాగనూర్(మక్తల్): అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి జిల్లాలోనే మక్తల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. లింగంపల్లి గ్రామంలో రూ. 30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను అందిస్తుందన్నారు. సర్పంచ్ సుజాత మాట్లాడుతూ.. తమ గ్రామాభివృద్ధిలో తనవంతు సహకారం అందిస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లత, ఉప సర్పంచ్ చిట్టెమ్మ, నాయకులు మైపాల్‌రెడ్డి, శివలింగప్ప, రమేష్, వెంకటరమణ, భీమేష్, ఈశ్వర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ గోపాల్‌నాయక్

మాగనూర్: ఉపాధి హామీ పథకం 12వ సామాజిక తనిఖీ ఈనెల 10 నుంచి 19వరకు మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఎస్ఆర్‌పీ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ తనిఖీ 01.01.2020 నుంచి 31.03.2022 వరకు ఉన్న ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిందని డీఆర్‌డీఓ గోపాల్‌నాయక్ తెలిపారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించగా ఇందులో కాల్వ పూడికతీత, రైతుల బావుల్లో, చెరువుల్లో పూడికతీత పనులు తదితర వివరాలు చదివి వినిపించారు. రూ.4.69 కోట్లు కూలీల వేతనాలు, రూ.1.82 కోట్లు మెటీరియల్ మొత్తం 6.5 కోట్లకు చెందిన ఆడిట్ వివరాలు పేర్కొన్నారు. ఉపాధి హామీలో పనిచేసిన కూలీలకు సకాలంలో కొలతలు తీసుకుని పేమెంట్ చేయాలని తెలిపారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, ఏపీఓ సత్యప్రకాష్ పాల్గొన్నారు.

ఊట్కూరు: గ్రామాలలో ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ కాలప్ప అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ భవనంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా ఉపాధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం కావడంతో కూలీలకు వ్యవసాయ పనులు లేవని ఉపాధి పనుల్లో వారికి అవకాశం కల్పించాలని అన్నారు. గ్రామాలలో ముళ్లపొదలు తొలగించడం, తదితర పనులు చేపట్టి కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ ఎల్లయ్య, ఈసీ శ్రీనివాస్, సిబ్బంది గోపాల్, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మాగనూర్: అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాగనూర్ ఏఎస్ఐ ఎస్‌కే మన్నన్ అన్నారు. శనివారం కొత్తపల్లి గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు కాల్ చేసి లాటరీలు తగిలిలాయి, లోన్స్ ఇస్తామని, తక్కువ ధరకే ఆన్‌లైన్ వస్తువులు వస్తాయని చెబితే నమ్మవద్దన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి సమాచారం అందించాలని అన్నారు. గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే డయల్ 100 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసలు కారాదని ఎవరైనా గంజాయి అమ్మినట్లు తెలిస్తే వెంటనే పోలీసు వారికి తెలపాలని, వాహనదారులు రోడ్డుపై వెళ్తున్నప్పుడు పరిమితి వేగంలో వెళ్లాలని తప్పకుండా హెల్మెట్ సీటు బెల్టు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది మహేష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'హాథ్ సే హాథ్ జోడో'పై సమావేశం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కోస్గి: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో మద్దతుగా మండలంలో చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. ఈ మేరకు శనివారం కోస్గిలో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలనను వివరించేందుకు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే నెల 3 నుంచి 21వ తేదీ వరకు పాదయాత్ర ఉంటుందన్నారు. 3న పోతిరెడ్డిపల్లి, 4న మల్‌రెడ్డిపల్లి, 5న సంపల్లి, 6న మాసాయపల్లిలో పాదయాత్ర ఉంటుందన్నారు. 9న చెన్నారం, 10న బిజ్జారం, 11న మీర్జాపూర్‌లో, 14న పీసీ తాండ, బొల్కోన్‌పల్లి, 15న ముశ్రీఫా, 16న ముంగిమళ్ళ, ముక్తిపాడ్, 17న లోదిపూర్, కొత్తపల్లి, 18న చంద్రవంచ, 19న నాచారం, 20న తోగాపూర్, 21న సర్జఖాన్‌పేట గ్రామాల్లో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలన్నారు. మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, ఇద్రీస్, భాను నాయక్‌తోపాటు పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మద్దూరు: వినియోగదారులు తపాలా శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. శనివారం మండలంలోని మద్దూరు, కొత్తపల్లి మండలాల్లోని పోస్టాఫీసులతో పొదుపు ఖాతాలపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 20 నుంచి 28 వరకు తపాలా శాఖ పొదుపు ఖాతాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న నాయకులు

మద్దూరు: ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేసే వారిని మండలికి పంపాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏవీఎస్‌రెడ్డి తరఫున మండలంలోని నందిపాడ్, పల్లెర్ల ఉన్నత పాఠశాల్లో ప్రచారం నిర్వహించారు. నాయకులు నర్సప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, సంతోష్, వెంకట్‌రాములు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డిని గెలిపించుకొని విద్యారంగ సమస్యలను పరిష్కరించుకుందామని తపస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శేర్ కృష్ణారెడ్డి, నర్సిములు అన్నారు. శనివారం మండలంలోని కాన్‌కుర్తి, మొగుల్‌మడ్క, విఠలాపూర్, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. పాఠశాలల హెచ్ఎంలు బసిరెడ్డి, నారాయణ, విశ్వనాథ్, విష్ణువర్ధన్, సూర్యనాయక్, రాఘవేందర్, రామకృష్ణరెడ్డి, పండరప్ప, మల్లేష్, సునీతలు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు పంపిణీ

నారాయణపేట రూరల్ : మండలంలోని బొమ్మన్‌పాడు గ్రామంలో శనివారం నట్టల నివారణ మందుల పంపిణీ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గొర్రెలు, మేకలకు మందులు వేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుగుణ, సర్పంచ్ శ్రీనివాస్, సిబ్బంది రేవతి, ప్రతాప్, గోపాలమిత్ర మాశప్ప, గొర్రెల పెంపకందారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా మందులు వేయించాలి

మాగనూర్: గొర్రెలు, మేకల పెంపకందారులు జీవాలకు నట్టల నివారణ మందు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. శనివారం మండల పరిధిలోని కొత్తపల్లి, ఓబ్లాపూర్ గ్రామాలలో నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెటర్నరి జూనియర్ అసిస్టెంట్ వినయ్‌కుమార్, సిబ్బంది నాగప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మందులు వేస్తున్న సిబ్బంది

ఉపాధ్యాయులైన విద్యార్థులు



పేటలోని శిశుమందిర్‌లో..



దాసర్‌దొడ్డిలో స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

నారాయణపేట రూరల్ : పట్టణంలోని అశోక్‌నగర్ శిశుమందిర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టర్‌గా కార్తికేయ, డీఈఓగా రేవన్ సిద్ధూ, ఎంఈఓగా గౌతమ్, హెచ్ఎంగా అక్షయ్‌లు వ్యవహరించగా పలువురు టీచర్లుగా విధులు నిర్వర్తించారు. నిర్వాహకులు బాలరాజు, శేషమ్మ, నర్సప్ప, లక్ష్మయ్యగౌడ్, సీఆర్‌పీ పవిత్ర, హెచ్ఎం విజయలక్ష్మి, టీచర్లు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని పులిమామిడి, మొగ్దుంపూర్ తదితర పాఠశాలల్లో స్వయంపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుశీలమ్మ, ప్రధానోపాధ్యాయులు వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొల్పూర్ పాఠశాలలో..

మాగనూర్(మక్తల్): దాసర్‌దొడ్డి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలనా దినోత్సవం నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, తిరుమలాపురం ప్రధానోపాధ్యాయులు ప్రాణేశాచారి తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల పరిధిలోని కొల్పూర్ మండల ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలనా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌గా వినోద్‌కుమార్, డీఈఓగా శివలింగం, హెచ్ఎంగా రేష్మతో పాటు మరికొంత మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. పాఠశాల హెచ్ఎం లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు పార్వతి, హారిక తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా పేరెంట్స్ మీటింగ్



సింగార్ బేస్ మీటింగ్ హాజరైన ఒకేఒక్క పేరెంట్

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలోని సింగార్ బేస్ ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్ – టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా చేపట్టారు. శనివారం పాఠశాలలో జరిగిన మీటింగ్‌లో కేవలం ఒకే ఒక్క మహిళా పేరెంట్ పాల్గొన్నారు. పాఠశాలలో ఐదవ తరగతి వరకు 70మంది విద్యార్థుల పేర్లు నమోదయి ఉండగా, వీరిలో 15 మంది భవిత కేంద్రానికి చెందినవారు ఉన్నారు. మిగతా 60మందిలో కనీసం పది శాతం విద్యార్థులకు సంబంధించిన తల్లిదండ్రులు కూడా మీటింగ్‌కు రాలేదు. మిగితా 60మందిలో కనీసం పది శాతం విద్యార్థులకు సంబంధించిన తల్లిదండ్రులు కూడా పాఠశాలకు రాలేదు. వాస్తవానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వి ద్యార్థులకు సంబంధించిన ప్రగతి నివేదికను తెలియచేయడానికి ప్రభుత్వం పేరెంట్ – టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని చేపడుతోంది. అయితే ఉపాధ్యాయులు పేరెంట్స్‌ను పాఠశాల వరకు తీసు కుని వచ్చే విషయంలో పూర్తిగా విఫలం అవుతున్నారు. చాలా పాఠశాలల్లో నా మమాత్రంగా కార్యక్రమం నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారు.

విద్యార్థుల హాజరు తప్పనిసరి

నర్వ: విద్యార్థులు పాఠశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఇందుకోసం తల్లిదండ్రులు సహకరించాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలు అన్నారు. శనివారం నర్వ, పెద్దకడ్మూర్, ఉందేకోడ్, రాయికోడ్, బెక్కర్‌పల్లి, గ్రామాలతో పాటు మిగిలిన గ్రామాల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతలను వెలికితీసేందుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యతను ఇరువురు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు నర్సిములు, శ్రీనువాసులు, మల్లేష్, తిరుపతయ్య, తదితరులున్నారు.